వలంటీర్లు సంక్షేమ వారధులు



రొద్దం: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎంపీ మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్



అగళిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- వలంటీర్లకు వందనంలో ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి ఎమ్మెల్సీ ఇక్బాల్

రొద్దం: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వంలటీర్లు వారధులుగా పనిచేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రాష్ట్రంలోని వలంటీర్లు అందించిన సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. అవినీతి నిర్మూలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి ప్రజలకు పరిపాలన అందుబాటులోకి తెచ్చారన్నారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. చంద్రబాబు నాయుడు వలంటీరల వ్యవస్థను చిన్నచూపుచూస్తూ వారిపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు ఈ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం జగన్ ఆలోచన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా పేద కుటుంబాలను దృష్టిలో ఉంచుకునే వాటిని అమలు చేస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. చంద్రబాబు, లోకేశ్ ప్రజలను నమ్మించడానికి అబద్ధాలు చెబుతూ రోడ్లపై పడ్డారని తెలిపారు. చంద్రబాబు వస్తే వర్షాలు కూడా రావని చెప్పారు. అనంతరం మండల వ్యాప్తంగా 213 సేవామిత్ర, ఐదు మంది సేవారత్న వలంటీర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌వి రవిశేఖర్, నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఆదర్శం..

హిందూపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి అందిస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఆఫీసు ఆవరణలో కమిషనర్ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. కోవిడ్ కష్ట సమయంలో మీరు చేసిన సేవలు మరువలేనివన్నారు. మీరు చేస్తున్న సేవలకు ప్రోత్సాహకరంగా మరింత ఉత్సాహంగా సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్రా పురస్కారాలు అందజేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్తులలో మీలో నుంచే నాయకులు కూడా ఎదగాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు.. ప్రజాప్రతినిధులు ప్రజా సేవకులు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఒకరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి అందుతున్నాయని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో సమూలంగా ఇంతమార్పు తెచ్చారో గమనించాలన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చదువు, వైద్యం, ఆరోగ్యం, భద్రత, వ్యవసాయ చేయూత, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తపన పడుతున్నారని చెప్పారు. ప్రజలకు ఏం మంచి చేస్తారో చెప్పడం మరిచి చంద్రబాబు, లోకేష్ ప్రభుత్వంపై బురదచల్లడమే పనిగి పెట్టుకున్నారని మండిపడ్డారు. అబద్ధాలు, మభ్యపెట్టే మాటలతో ప్రజల మనస్సుల్లో విషబీజాలు నాటే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలో వస్తే సచివాలయ వ్యవస్థ తీసేస్తామని టీడీపీ చెబుతోందన్నారు. ప్రజలను సంక్షేమ పథకాలతో సోమరులను చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అధికారంలో వస్తే పథకాలు ఇస్తామని రెండు నాలుకల ధోరణితో ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర(అగళి): సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం అగళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్లపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం వలంటీర్లను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. వలంటీర్లు కష్టపడి పని చేయడంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయని గుర్తు చేశారు. ఎన్నో ప్రభుత్వ కార్యక్రమాల్లో వలంటీర్లు భాగస్వాములవుతున్నారన్నారు. బాగా పని చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమఫలాలు అందించే బాధ్యత వలంటీర్లదేనని తెలిపారు. సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రేణుక, కన్వీనర్ మహేంద్ర, డైరెక్టర్ బిదురమ్మ, జేసీఎస్ కన్వీనర్ శివన్న, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, వైస్‌ఎంపీపీలు, స్థానిక నాయకులు చంద్రప్ప, కామరాజు, నటరాజు, సతీష్, శివకుమార్, హనుమంతరాయప్ప, క్రిష్ణప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండ్లిజీవి, అప్పాజిహళ్లిలోని రెండు ఆలయాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పెండ్లిజీవిలోని ఆంజనేయస్వామి ఆలయ గర్భగుడిలో దేవుడికి అలంకరించిన సుమారు 4 కేజీల వెండి ఆభరణాలు, హుండీలోని రూ.3 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాస్ తిరుమణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. ఇక అప్పాజిహళ్లికి చెందిన బలిజల ఆరాధ్యదైవమైన గురప్పస్వామి ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయ సమీపంలో హుండీ పగులగొట్టి అందులో ఉన్న రూ.2 లక్షల నగదు అపహరించారు. సుమారు రూ.20 వేల చిల్లర నాణేలను అక్కడే వదిలేశారు. గుడికట్టు పెద్దలు రామాంజినప్ప, ఆదిశేషప్ప, నాగభూషణ, మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పట్టణంలోని కణివే లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీకి విఫలయత్నం జరిగింది. అయితే ఆలయానికి ఎదురుగా అయ్యప్ప ఆలయంలో రూ.50 వేల విలువైన హుండీ సొమ్మును ఎత్తుకెళ్లారు. నిర్వాహకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమయ పాలన పాటించాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

లేపాక్షి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులందరూ కచ్చితంగా సమయ పాలన పాటించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డితో సమావేశం నిర్వహించారు. రోజూ సాయంత్రం జరిగే స్పందన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా ఎన్ని సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మాణంలో ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తి అయ్యాయి? పూర్తికానివి ఎన్ని ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హిందూపురం: పెండింగ్‌లో ఉన్న ఎలక్షన్ క్లైమ్స్ సత్వరం పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ ఆఫీసుల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే మున్సిపాలిటీ, మండలం పరిధిలోని సచివాలయాలు, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు త్వరగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణాలపై అశ్రద్ధ చూపిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం మలుగూరులోని భూములను పరిశీలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా అసైన్డ్ ల్యాండ్ ఇతరులు కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నరేంద్ర పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు ముగ్గురి ఎంపిక



డి.ఇలాహీ



టి నరసింహనాయుడు



ఎం.లక్ష్మీవసంత్

పరిగి: 'జగనన్న ఆణిముత్యాలు'కు ఏపీ ఆర్‌ఎస్ విద్యార్థులు ముగ్గురు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్‌బాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకానికి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పురస్కారాన్ని పొందడానికి ఎంపికై నట్లు తెలిపారు. డీ ఇలాహీ అనే విద్యార్థి 600 మార్కులకు గానూ 590 మార్కులు, టి.నరసింహనాయుడు అనే విద్యార్థి 588 మార్కులు, లక్ష్మీవసంత్ అనే విద్యార్థికి 587 మార్కులు సాధించాడు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు పాటించకుండా పట్టణంలోని నారాయణ కళాశాల ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు నిర్వహిస్తోందని, విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడారు. ఒక్కొక్క విద్యార్థి నుంచి ఎంసెట్, జేఈఈ మెయిన్స్ పేర్లతో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజులతో పాటు ఇక్కడే పాఠ్యపుస్తకాలు కొనాలని నిబంధన పెట్టి అదనంగా రూ.6వేల నుంచి రూ.8వేలు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షకుమార్, నవీన్, లిఖిత్, భగత్, మహేష్, వినోద్, ప్రసన్న, రోహిత్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు అందుబాటులో ఉండాలి

లేపాక్షి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ జరిగే స్పందన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ నరసింహనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లకుండా సచివాలయంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సెలవు పెట్టాలంటే అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా అనధికారికంగా వెళ్తే అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృతి చెందిన ఓటర్ల వివరాలు సేకరించండి

రొళ్ల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాలో పేర్లు ఉండి మృతి చెందిన వారి వివరాలను సేకరించాలని తహసీల్దార్ హసీనాసుల్తానా బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్షుణంగా పరిశీలించి మృతి చెందిన ఓటర్ల పూర్తి వివరాలను సేకరించడంతో పాటు ఈనెలఖరు లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసి తొలగింపు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు నుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

వైఎస్ జగన్ అభిమాని బైక్‌యాత్ర



మడకశిరకు చేరుకున్న బైక్‌యాత్ర

మడకశిరరూరల్: నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన సీఎం వైఎస్ జగన్ అభిమాని అడవి కొట్టురాజు జగనన్నే మాభవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ నినాదంతో చేపట్టిన బైక్‌యాత్ర గురువారం మడకశిరకు చేరుకుంది. అడవికొట్టురాజు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని కలిసి చేపట్టిన బైక్ యాత్ర వివరించించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే అతడిని అభినందించారు. ఈ సందర్భంగా అడవికొట్టురాజు మాట్లాడుతూ ఈ నెల 14న చేపట్టిన బైక్ యాత్ర 32 నియోజకవర్గాల్లో పూర్తయిందన్నారు. ప్రతి చోట తనకు వైఎస్ జగన్ అభిమానులు స్వాగతం పలికి అభినందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జగనన్న సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ యాత్ర కొనసాగిస్తున్నాని ఆయన తెలిపారు.

టీడీపీ నాయకుడి దౌర్జన్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పాతఊరులో నివాసముంటున్న పందుల పెంపకం దారులైన రవి, గణేష్ ఇంటిపై టీడీపీ నాయకుడు మారుతి అతని అనుచరులు దాడికి పాల్పడినట్లు బాధితులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మారుతీ బావ బాలస్వామి ఉద్దేశ పూర్వకంగా గురువారం సాయంత్రం తమతో ఘర్షణకు దిగాడని, తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. తమ బావ పైనే ఫిర్యాదు చేస్తారా? అని ఇంటివద్దకు వచ్చి ఆటో, ఇంటిలో సామగ్రి ధ్వంసం చేసినట్లు బాధితులు వాపోయారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిపైనా టీడీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించాలి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని కమిషనర్ ప్రభాకర్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రక్రియలన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈవిషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన హిందూపురం రోడ్డులో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించండి



మంత్రిని కలిసిన దళిత నాయకులు

పెనుకొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పెనుకొండలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని న్యాయవాది శివరామకృష్ణ, వెంకటేశులు, ఎంఎస్ మూర్తి, దండోరా రామాంజి, వెంకటేశులు తదితరులు మంత్రి మేరుగ నాగార్జునను కోరారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సేవలు



భోజనం వడ్డిస్తున్న డాక్టర్ నవీన, వేణుగోపాలరావు

పరిగి: ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు, బాలింతలు, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నవీన తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో అమ్మ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైద్య పరీక్షలను వచ్చిన గర్భిణులకు బీపీ, షుగర్ లెవెల్స్, రక్తశాతం, హిమోగ్లోబిన్ స్థాయి, ఎత్తు, బరువు తదితర పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

పరిగి: పరిగి మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవితప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మోదా గ్రామంలో ఉదయం 8 గంటలకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఉదయం 9 గంటలకు పరిగి మండల కేంద్రంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందిస్తారన్నారు.

ఏపీఓగా గోపాల్



అమరాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీఓగా గోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల నుంచి ఇంచార్జ్ ఏపీఓగా హెన్రీ విధులు నిర్వర్తిస్తున్నారు. గుత్తి ఏపీడీ కార్యాలయంలో క్లస్టర్ ఏపీఓగా ఉన్న గోపాల్‌ను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామచంద్రప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని బూచేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్ల రామచంద్రాప్ప బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ బూచేపల్లికి చేరుకొని రామచంద్రాప్ప మృత దేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో పుట్టగుండ్లపల్లి సర్పంచ్ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మల్లికార్జున, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేయాలి

మడకశిర: పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేయడానికి ఎమ్మార్పీస్ నాయకులు అంజినప్ప, శివప్ప, ఎల్లోటి రామాంజి, అంజి, చందు, రమణ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని హిందూపురం రోడ్డు, మధుగిరి సర్కిల్‌లో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.


గార్మెంట్స్ పరిశ్రమలో గుండె వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమలో డాక్టర్ యాస్మీన్, రామ్ కుమార్, సిద్దిక్ ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా ఆస్పత్రి నేతృత్వంలో గురువారం గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 160 మందికి ఉచితంగా వివిధ రకాల గుండె జబ్బులపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో తదితర వైద్య పరీక్షలను చేపట్టారు. ఇందులో ఆరుగురిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు డాక్టర్ యాస్మీన్ తెలిపారు. కార్యక్రమంలో గార్మెంట్స్ జీఎం శామ్యూల్, ఏజీఎం మహేష్, హెచ్‌ఆర్‌ఎంలు గంగాధర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత



దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందిస్తున్న శశికిరణ్

పావగడ: పట్టణంలోని బనశంకరి లే అవుట్ సమీపంలో నివాసముంటున్న ఆశా, శివ దంపతుల కుమార్తె దివ్యాంగురాలు మాన్యకు స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ గురువారం వీల్‌చైర్ అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో ప్రకాశ్, మంజు తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	34.0	ఉష్ణోగ్రత
పెనుకొండ	37.0	ఉష్ణోగ్రత
మడకశిర	34.0	ఉష్ణోగ్రత

సజావుగా ఇంటర్ పరీక్షలు

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం సజావుగా జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం ఇంగ్లిషు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్ష జరిగినట్లు పరీక్షల ముఖ్య పర్యవేక్షకుడు మహేష్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొంటారన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఉపయోగం

అమరాపురం: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి వి/ ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, గ్రంథాలయాధికారి ఇబ్రహీం పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని డైరెక్టర్ సుందర్‌రాజు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఏమేమి నేర్పిస్తున్నారు, పుస్తక పఠనం ఏవిధంగా ఉంది, ఇన్నర్ గేమ్స్ ఆడుతున్నారా తదితర వివరాలను ఆయన విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

పెనుకొండ: ఇంటి నిర్మాణానికి రుణం తీసుకుని ప్రమాద వశాత్తూ మరణించిన శేఖర్ కుటుంబానికి స్థానిక స్టేట్‌బ్యాంక్ మేనేజర్ వెంకటరమణయ్య గురువారం రూ. 6.99 లక్షల చెక్కు అందించారు. మేనేజర్ మాట్లాడుతూ 2016లో పట్టణంలోని స్టేట్ బ్యాంక్‌లో ఇంటిపై రూ. 7.50 లక్షల రుణం తీసుకున్న శేఖర్ 2023 ఫిబ్రవరిలో ప్రమాద వశాత్తూ మృతిచెందాడన్నారు. రుణం తీసుకున్న శేఖర్ అప్పట్లో బ్యాంకుకు బీమా ప్రీమియం కింద రూ. 41 వేలు చెల్లించి ఉండడంతో పరిహారం మంజూరైందన్నారు. బాధితురాలు రేవతికి మేనేజర్ చెక్కు అందజేశారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ఉపాధి పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.